ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

మంగళవారం 4 ఫిబ్రవరి 2025



అన్నాదురై సమాధిపై పూలు వేసి నివాళులర్పిస్తున్న ఎంకే స్టాలిన్

అన్నాదురైకి నివాళి

అధికార, విపక్ష పార్టీల మౌన ర్యాలీలు



అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఇతర నేతలు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత సీఎన్ అన్నాదురై 56వ వర్ధంతి సందర్భంగా సోమవారం డీఎంకే, అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు పార్టీల నేతలు, పార్టీ శ్రేణులు మెరీనాబీచ్‌లోని అన్నాదురై సమాధి ప్రాంతం వరకూ మౌన ర్యాలీ చేశారు. మొదట డీఎంకే ఆధ్వర్యంలో ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వంలో మౌనర్యాలీ అన్నాసాలైలోని అన్నాదురై విగ్రహం కూడలి నుంచి ప్రారంభమైంది. ర్యాలీలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, పొన్ముడి, పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, సామినాథన్, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, మదివేందన్, కయల్ విళి సెల్వరాజ్, ఎంపీలు టీఆర్‌బాలు, ఎ.రాజా, జగద్రక్షకన్, పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, పార్టీ ప్రచార విభాగం నేత టీకేఎస్ ఇళంగోవన్, మాజీ మంత్రి పూంగోదై ఆలడి అరుణా, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యేలు వేలు, డాక్టర్ ఎళిలన్, ఐడ్రీమ్ మూర్తి, జేజే ఎబినేజర్, మాధవరం సుదర్శనం, కారపాక్కం గణపతి, వెట్రి అళగన్, పార్టీ నేతలు పూచ్చి మురుగన్, హార్బర్ కాజా, కాశిముత్తు మాణిక్కం తదితరులు మౌనర్యాలీలో పాల్గొన్నారు. చివరగా మెరీనాబీచ్‌లోని అన్నాదురై సమాధి వద్దకు చేరుకున్నారు. సీఎం స్టాలిన్ సహా మంత్రులు, నాయకులు సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆ తరువాత అక్కడికి సమీపంలో ఉన్న మాజీ సీఎం దివంగత కరుణానిధి సమాధి వద్దకు చేరుకుని నివాళులర్పించారు. సోమవారం మధ్యాహ్నం నగరంలోని సుప్రసిద్ధ ఆలయాలలో సహపంక్తి భోజన కార్యక్రమాల్లో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో...

ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), మాజీమంత్రులు, ఇతర నాయకులు అన్నాదురై సమాధి వరకు మెరీనాబీచ్‌లో మౌన ర్యాలీ నిర్వహించారు. అన్నాదురై సమాధిపై ఈపీఎస్ పుష్పవలయాన్ని ఉంచి నివాళులర్పించారు. ఆయనతోపాటు పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు సి. పొన్నయ్యన్, దిండుగల్ శీనివాసన్, డి. జయకుమార్, నత్తం విశ్వనాధన్, కేపీ మునుసామి, పి. తంగమని, కేపీ అన్బళగన్, మాజీ ఎంపి జయవర్ధన్, డైరెక్టర్ నాంజిల్ పీసీ అన్బళగన్, న్యాయవాది ఎ. పళని, నిర్మలా పెరియసామి, టీకేఎం చిన్నయ్య, మాధవరం మూర్తి, కమలకన్నన్, టి. నగర్ సత్యా, నేలంబూరు ఇమ్మానువేల్, మధురవాయల్ అమ్మాపేరవై కార్యదర్శి ముగప్పేర్ ఇలంజెళియన్ దివంగత నేత సమాధి వద్ద నివాళులర్పించారు. ఇదే విధంగా ద్రావిడ కళగం నేత కే వీరమణి, మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం, ఆయన అనుచరులు, న్యూజస్టిస్ పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం తదితరులు కూడా అన్నాదురై సమాధి వద్ద నివాళులర్పించారు.



శ్రీనివాస పెరుమాళ్ ఆలయ మహాసంప్రోక్షణంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, రవీంద్ర సన్నారెడ్డి, రవీంద్రకుమార్‌రెడ్డి తదితరులు

దేవాలయాల అభివృద్ధే లక్ష్యం

- ఇప్పటివరకు 2500 ఆలయాలకు కుంభాభిషేకం
- మంత్రి పీకే శేఖర్‌బాబు
- వైభవంగా శ్రీనివాస పెరుమాళ్ ఆలయ మహాకుంభాభిషేకం

ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇప్పటివరకు 2500 ఆలయాలకు కుంభాభిషేకం జరిపించమని దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. రాయపేటలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస పెరుమాళ్ ఆలయంలో సోమవారం మహాకుంభాభిషేకోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటివరకు కుంభాభిషేకం నిర్వహించిన 2,504 ఆలయాల్లో ఐదు ఆలయాలు వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగినవని వివరించారు. ఈ ఆలయాల్లో జీర్ణోద్ధారణ నిమిత్తం ప్రభుత్వం రూ.300కోట్లు రాయితీ అందజేసిందన్నారు. ఈ ఏడాది డిసెంబరులోగా 300 ఆలయాలకు తమ శాఖ తరుపున కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆలయాల అర్చకులకు ప్రతినెలా ప్రోత్సాహక నిధిగా రూ.1000 పంపిణీచేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

గోవిందనామస్మరణతో మార్మోగిన రాయపేట ...

స్థానిక రాయపేటలో ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో మద్రాస్ ప్రిసీడియం హయాంలో 250ఏళ్ల క్రితం నిర్మితమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస పెరుమాళ్ ఆలయంలో ప్రతి రోజు పూజలు జరుగుతున్నాయి. పురాతనమైన ఈ ఆలయానికి జీర్ణోద్ధరణ కమిటీ నిర్వాహకులుగా తెలుగు ప్రముఖులు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కేఈహెచ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వసంత్‌కుమార్, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) తమిళనాడు విభాగం అధ్యక్షులు పి.రవీంద్రకుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తికావడంతో ఆలయ సన్నిధికి అష్టబంధన, మహాసంప్రోక్షణ కు ఏర్పాట్లు చేశారు. ఆ మేరకు ఈ నెల 1వతేదీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి యాగశాల పూజలకు అంకురార్పనం చేశారు. ఆదివారం పుణ్యాహవచనం, నిత్య హోమం, ఉత్సవ మూర్తులకు తిరుమంజనం తదితర పూజలను రాష్ట్రంలోని వైష్ణవ దివ్యదేశాలకు చెందిన 50మంది పురోహితులు చేశారు. మూడోరోజైన సోమవారం ఉదయం 6నుండి 8 గంటల వరకు సుప్రభాతం, విశ్వరూపదర్శనం, పుణ్యాహవచనం, యాగశాల తిరువారాధన, నిత్యహోమం, మహాపూర్ణాహుతి బాలవర్లకు అభిషేకాలు జరిపారు. 9 గంటలకు శుభముహూర్తంలో ఆలయగోపుర కలశాలకు, సన్నిధి, విమానాలకు మహాకుంభాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీనివాస పెరుమాళ్ జీర్ణోద్ధారణ కమిటీ నిర్వాహకులు భట్టాచార్యులకు నూతన వస్త్రాలు అందజేసి, ఆలయజీర్ణోద్ధరణ పనులకు సహకరించిన వారిని సత్కరించి భక్తులకు అన్న, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెట్ తమిళనాడు విభాగం నిర్వాహకులు, పురప్రముఖులు హాజరయ్యారు.



చెన్నై జెట్ విభాగం నిర్వాహకులకు ఆలయ మర్యాదలతో సత్కారం

అవినీతిని బయటపెడితే హత్యాయత్నమా?

- నా ఆఫీసు గదికి నిప్పంటించారు!
- ఇక సామాన్యుల సంగతి ఏమిటి?
- అడిషనల్ డీజీపీ కల్పనా నాయక్ ఆరోపణ
- డీజీపీకి రాసిన లేఖ ఆలస్యంగా లీక్





గతేడాది జూలైలో దగ్ధమైన ఆమె ఆఫీసు గది (ఫైల్‌ఫొటో), అడిషనల్ డీజీపీ కల్పనా నాయక్(ఇన్‌సెట్లో)

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు ఉద్యోగాల ఎంపికలో జరిగిన అవకతవకలను వెలుగులోకి తీసుకురావటంతో తనను హతమార్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ మహిళా ఐపీఎస్ అధికారి కల్పనా నాయక్ డీజీపీ శంకర్‌జివాల్‌కు రాసిన లేఖ తీవ్ర కలకలం సృష్టిస్తోంది. 2024 జూలై 29న నగరంలో ఉన్న తన కార్యాలయం మంటల్లో దగ్ధమైందని, ఆ ఘటన తనను టార్గెట్‌గా చేసుకుని జరిగిన హత్యాయత్నంగా అనుమానిస్తున్నట్లు ఆ లేఖలో ఆమె ఆరోపించారు. రాష్ట్ర పోలీసు శాఖలో ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, జైలువార్డెన్‌లు, అగ్నిమాపక సిబ్బంది ఎంపికలో జరిగిన అవకతవకలను బట్టబయలు చేసిన కొద్ది రోజులకే ఈ ఘటన జరిగిందని తెలిపారు. న్యాయస్థానం ఉత్తర్వులను అధిగమించి తాను ఉద్యోగుల ఎంపికను అడ్డుకున్నానని, దాని వలన జరగబోయే అప్రతిష్ట నుండి రాష్ట్ర ప్రభుత్వాన్ని కాపాడానని, ఆ విషయమే తన ప్రాణాలకు ముప్పు తెచ్చేలా తయారైందని తెలిపారు. తన గత యేడాది జూలై 29న తాను కొద్ది నిమిషాలకు ముందు కార్యాలయానికి వెళ్ళి ఉంటే ప్రాణాలను కోల్పోయేదన్నారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ సంఘటన జరిగింది. ఆ ప్రమాదం జరిగిన మరుసటి రోజే పోలీసుశాఖ ఉద్యోగాల ఎంపిక తన ఆమోదం లేకుండానే జరిగినట్లు ఆమె ఆరోపించారు. సీనియర్ పోలీసు అధికారి అయిన తన ప్రాణాలకే భద్రత లేనప్పుడు, సాధారణ పోలీసుల పరిస్థితి ఏమిటి? అని ఆమె ప్రశ్నించారు. ఈ అగ్ని ప్రమాదం జరిగిన 15 రోజుల తర్వాత అంటే 2024 ఆగస్టు 15న డీజీపీ శంకర్‌జివాల్‌కు ఆమె ఆ లేఖ పంపారు. ఆ లేఖ ప్రతులను హోంశాఖ కార్యదర్శి, చెన్నై పోలీసు కమిషనర్‌కు కూడా పంపినట్లు ఆమె తెలిపారు. తనపై జరిగిన హత్యాయత్నంపై విచారణ జరపాలంటూ ఆరునెలల క్రితమే ఆదేశాలున్నప్పటికీ ఆ విచారణకు సంబంధించిన ఫలితాల ఇంకా వెలువడలేదని తెలిపారు.

డీజీపీ వివరణ... : అడిషనల్ డీజీపీ కల్పనానాయక్ గదిలో జరిగిన అగ్ని ప్రమాదం వెనుక ఎలాంటి కుట్రలు లేవని, ఆ సంఘటన ప్రమాదంగానే భావిస్తున్నామని డీజీపీ శంకర్ జివాల్ సోమవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రమాదం జరిగిన వెంటనే ఆమె డీజీపీ కార్యాలయానికి ఫిర్యాదు చేశారని, అగ్ని ప్రమాదంపై ఎగ్మూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ కూడా జరిపారని తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణులు, అగ్నిమాపకశాఖ నిపుణులు, విద్యుత్ బోర్డు అధికారుల వద్ద ఆఅగ్ని ప్రమాదం గురించిన వివరాలను కూడా సేకరించినట్లు తెలిపారు.

గవర్నర్‌కు సుప్రీంలో ఊరట

- రీకాల్ పిటిషన్ తోసివేత

ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ప్రభుత్వంతో నెలకొన్న విభేదాలు, బిల్లుల పెండింగ్ తదితర వ్యవహారాలతో వివాదాస్పంగా మారిన గవర్నర్‌ను రాష్ట్రపతి కార్యాలయం రీకాల్ చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ న్యాయవాది జైసుఖిల్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం తోసిపుచ్చింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు పెండింగ్‌లో వున్నందున మళ్లీ కొత్తగా మరో వ్యాజ్యం అవసరం లేదని, దీనిపై తాము రాష్ట్రపతికి గానీ, కేంద్ర ప్రభుత్వానికి గానీ ఎలాంటి ఆదేశాలివ్వలేమని స్పష్టం చేస్తూ పిటిషన్ కొట్టి వేసింది. జనవరిలో జరిగిన తొలి అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రసంగించకుండానే సభ నుండి వెళ్లిపోయిన ఘటన దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. రాష్ట్రప్రభుత్వ విధి విధానాల ప్రకారం ఏడాదిలో జరిగే తొలి అసెంబ్లీ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం కావడం ఆనవాయితీ. గవర్నర్ ప్రసంగానికి ముందు తమిళ్ తాయ్ గీతం, చివరగా జాతీయగీతం జనగణమన ఆలపించే విధానం కొనసాగుతోంది. అయితే ఈ విధానాన్ని మార్చి ప్రారంభంలోనే జాతీయగీతం పాడాలన్న గవర్నర్ కోరికను అసెంబ్లీ నిరాకరించడంతో గవర్నర్ తన ప్రసంగపాఠాన్ని చదవకుండానే సభ నుండి వెళ్లిపోయారు. గవర్నర్ చర్యలు రాష్ట్ర అసెంబ్లీని, రాజ్యాంగాన్ని అవమానించే విధంగా ఉన్నాయని పలు రాజకీయ పార్టీలు విమర్శించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయడంతో పాటు రాజ్యాంగాన్ని ధిక్కరించిన గవర్నర్ ఆర్ఎన్ రవిని రీకాల్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసేలా కేంద్రప్రభుత్వాన్ని, రాష్ట్రపతికి ఆదేశించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలు పిటిషన్లు పెండింగ్‌లో వున్నాయని గుర్తు చేసింది.

ఈరోడ్ తూర్పులో ప్రచారం పరిసమాప్తి

- రేపు పోలింగ్

ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన ఉప ఎన్నిక జరగనున్న ఈరోడ్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గంలో గత రెండు వారాలుగా హోరాహోరీగా సాగిన ప్రచారం సోమవారం సాయంత్ర 6గంటలకు ముగిసింది డీఎంకే అభ్యర్థిగా వీసీ చంద్రకుమార్, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా సీతాలక్ష్మి సహా మొత్తం 46మంది ఉప ఎన్నికల బరిలో నిలిచారు. సోమవారం సాయంత్రం 6గంటలకు ఎన్నికల ప్రచార హోరు ముగిసింది. ఎన్నికల సంఘం హెచ్చరికలతో ఈ నియోజకవర్గంలో ఉన్న లాడ్జీలు, సత్రాలు, కల్యాణ మండపాలు, పార్టీ కార్యాలయాల్లో మకాంవేసి ప్రచారంలో పాల్గొన్న పొరుగు ప్రాంతాల రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గం నుండి వెళ్లిపోయారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 2,27,546 మంది ఓటర్లు ఉన్నారు. బుధవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరుపు ఏజెంట్లకు ఫొటో గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. పోలింగ్ రోజున ఎన్నికల కమిషన్ నుండి ముందుగా అనుమతి పొందిన మూడు వాహనాలను ఉపయోగించుకోవచ్చని అభ్యర్థులకు ఈసీ ఉత్తర్వులు జారీచేసింది.



ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు సోమవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవితో మర్యాదపూర్వకంగా భేటీ అయిన దృశ్యం

కలవరపెడుతున్న 'జీబీఎస్' వైరస్

తొమ్మిదేళ్ల బాలుడి మృతి



ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీబీఎస్ అనే కొత్త వైరస్ బారిన పడి తొమ్మిదేళ్ల బాలుడు మృతిచెందడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దేశంలో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాళ్ రాష్ట్రాల అనంతరం, జీబీఎస్ అనే కొత్త రకం వైరస్ రాష్ట్రంలో వెలుగు చూసింది. తిరువళ్లూరు సమీపంలోని తిరువూరు ఎంజీఆర్ నగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ కుమారుడైన వైదీశ్వరన్ (9) అదే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆదిద్రావిడుల సంక్షేమ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. గత నెల 22వ తేదీ ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరగా వైదీశ్వరన్ కాళ్లు కదపలేక ఇబ్బందుల పాలయ్యాడు. దీంతో ఆ బాలుడిని తన తల్లిదండ్రులు వేపంపట్టు ప్రాంతంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లగా, వైద్యపరీక్షలు చేసి, మందులిచ్చారు. ఇంటికెళ్లిన బాలుడు నడవకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు తిరువళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించి నరాలు సక్రమంగా పనిచేయకపోవడంవల్లే బాలుడి రెండు కాళ్లు సచ్చుబడిపోయినట్లు నిర్ధారించారు. వారి సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం స్థానిక ఎగ్మోర్‌లోని ప్రభుత్వ చిన్న పిల్లల ఆస్పత్రిలో చేర్పించారు. బాలుడి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌లో పరిశోధించిన వైద్యులు అతనికి జీబీఎస్ అనే కొత్త వైరస్ సోకినట్లు నిర్ధారించి, ఎమర్జెన్సీ చికిత్సా విభాగంలో చేర్చారు. అయితే చికిత్స ఫలించక వైదీశ్వరన్ శనివారం మృతిచెందాడు. రాష్ట్రంలో జీబీఎస్ వైరస్‌కు సంభవించిన తొలి మరణం నమోదు కావడంతో, ఆరోగ్య శాఖ అధికారులు దానిని నివారించే చర్యలు ముమ్మరం చేశారు. తిరువూర్ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. మరోవైపు మున్సిపల్ అధికారులు క్రిమిసంహారక మందులు చల్లిస్తున్నారు. దీనిపై అప్రమత్తంగా వుండాలని, పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని అధికారులు స్థానికులను హెచ్చరిస్తున్నారు.

సమాచార దర్శిని

'క్యూట్' దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కేంద్ర విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సుల అడ్మిషన్లు 'క్యూట్' ద్వారా నిర్వహిస్తుంటారు. 2025-26వ విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల క్యూట్ పరీక్ష మార్చి 13 నుంచి 31వ తేది వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు స్వీకరణ జనవరి 2న ప్రారంభమై ఈ నెల 1వ తేదీతో ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువు ఈ నెల 8వ తేది వరకు పొడిగించగా, 9వ తేదిలోపు ఫీజు చెల్లించాల్సి ఉంది. దరఖాస్తులు /exams.nta.ac.in/CUETPG/ అనే వెబ్‌సైట్‌లో నమోదుచేయాలి. మరిన్ని వివరాలకు 011-40 759000. helpdeskcuetp-g@nta.ac.in అనే ఈ-మెయిల్ సంప్రదించవచ్చు.

8 వరకు పొడి వాతావరణం

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 8వ తేది వరకు పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. తూర్పు గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. అదే సమయంలో తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తెల్లవారుజామున, ఉదయం మంచు తీవ్రత కొనసాగుతుందని, రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, ఉదయం వేళల్లో దట్టమైన మంచు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

మరో ఆరు ప్రాంతాల్లో 'తోళి' మహిళల విడిది గృహాలు

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన నగరాల్లో మరో ఆరు ప్రాంతాల్లో 'తోళి' విడిది గృహాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మహిళలు ఉద్యోగం, చదువు నిమిత్తం రాజధాని చెన్నై సహా పలు నగరాలకు వస్తుంటారు. అలా వస్తున్న వారిలో అధిక శాతం మంది ప్రైవేటు విడిది గృహాల్లో బసచేస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఉద్యోగం చేస్తున్న మహిళల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం 'తోళి మహిళా విడిది గృహాలు' పేరుతో భోజనం, బస తదితరాలకు తక్కువ ధరకు అందజేస్తోంది. తొలివిడతగా నగరంలో పరిచయం చేసిన ఈ ప్రాజెక్టుకు మంచి స్పందన లభించింది. తాజాగా చెన్నైలో రెండు, రామనాథపురం, దిండుగల్, కోయంబత్తూర్, కృష్ణగిరిలో తలా 1 చొప్పున మొత్తం 950 మంది బసచేసేలా ఆరు విడిది గృహాలను రూ.70 కోట్లతో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది.

నాణ్యత లేని 135 మందులు

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో విక్రయిస్తున్న మందులు తదితరాల నాణ్యతను కేంద్ర మందుల నాణ్యత నిర్ధారణ బోర్డు పరిశీలిస్తోంది. పరిశీలనలో నాణ్యత లేని, నకిలీ మందులను గుర్తించి తగిన చర్యలు చేపడుతోంది. ఆ ప్రకారం డిసెంబరులో 1,000కి పైగా మందుల శాంపిల్స్ పరిశీలించారు. వాటిలో బాక్టీరియల్ ఇన్ఫెక్షన్, డైజెస్టివ్ ట్రాక్ ఇన్ఫెక్షన్, జలుబు, విటమిన్ లోపం తదితర వ్యాధులను వినియోగించే 135 మందులు నాసిరకమైనవిగా గుర్తించారు. ఆ మందుల వివరాలు http-s://cdsco.gov.in అనే వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఎగ్జిబిషన్‌కు స్పందన

వేలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మామిడి కాయల మండి సమీపం కృపా వ్యాపార మైదానంలో జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను గత నెల 12వ తేది మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో రెవెన్యూ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు సహా పలు శాఖలు అందిస్తున్న పథకాలు, సంక్షేమ సహాయాల వివరాలు, లబ్ధిపొందుతున్న వారి వివరాలున్నాయి. ఈ నెల 25వ తేది వరకు జరుగనున్న ఈ ఎగ్జిబిషన్‌ను ఆదివారం వరకు 10,890 మంది వీక్షించారని జిల్లా సమాచార శాఖ సోమవారం ప్రకటన విడుదల చేసింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో వినియోగదారులు పాల్గొని సమస్యలకు పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. గ్రీవెన్స్ జరిగే ప్రాంతాల వివరాలు .

కేకే నగర్: నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, కేకే నగర్ సబ్ స్టేషన్ ప్రాంగణం,

అంబత్తూర్: నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, 3వ మెయిన్ రోడ్డు, సబ్ స్టేషన్ ప్రాంగణం, అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్

మైలాపూర్: నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, వళ్లువర్‌కోట్టం సబ్ స్టేషన్ ప్రాంగణం, కోడంబాక్కం హైరోడ్డు

తండయార్‌పేట: నిర్వహణ ఇంజనీర్, నెం.805, టీహెచ్ రోడ్డు, బెల్ టవర్ ఎదురుగా, తండయార్‌పేట.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం ధర్నా

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఇటీవల పార్లమెంటులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థల బడ్జెట్‌గా ఉందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పన, ఉపాధి హామీ పథకం రోజులు పెంపు, గిట్టుబాటు ధరలు, జీఎస్టీ తగ్గింపు తదితరాలు లేదన్నారు. బీమా రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి ప్రమాదకరమైన నిర్ణయమన్నారు. ఈ బడ్జెట్‌ను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

● వేంగైవయల్ కేసు..

జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ

● సీబీసీఐడీ ఛార్జిషీట్‌కు గ్రీన్ సిగ్నల్



వేంగైవయల్‌లోని నీటి తొట్టె

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పుదుకోట సమీపం వేంగైవయల్ గ్రామంలో నీటితొట్టెలో మానవ వ్యర్థాలు కలిపిన కేసు విచారణను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేస్తూ పుదుకోట అంటరానితన నిరోధక ప్రత్యేక కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. ఈ సంఘటన జరిగిన రెండేళ్ల తరువాత సీబీసీఐడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను తోసిపుచ్చలేమని కోర్టు స్పష్టం చేసింది. వేంగైవయల్ కేసుపై తొలుత స్థానిక పోలీసులు విచారణ జరిపారు. ఆ తర్వాత కేసును సీబీసీఐడీకి బదిలీ చేశారు. రెండేళ్లుగా సీబీసీఐడీ విచారణ జరిపిన మీదట పుదుకోట కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఆ కేసులో వేంగైవయల్‌కు చెందిన ముగ్గురిని నిందితులుగా పేర్కొన్నారు. ఈ పరిస్థితులలో వేంగైయల్ కేసులో సీబీసీఐడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను తోసిపుచ్చాలని కోరుతూ పుదుకోట అంటరానితనం నిరోధక ప్రత్యేక కోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సీబీసీఐడీ ఛార్జిషీట్‌లో నిందితులుగా పేర్కొన్న ముగ్గురు కలిసి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సీబీసీఐడీ విచారణ సమగ్రంగా జరుపలేదని, అవాస్తవాలతో ఛార్జిషీట్ రూపొందించి చివరిక్షణంలో కోర్టులో సమర్పించారని ఆరోపించారు. తమకు ఛార్జిషీట్ నకలు అందజేయాలని, ఛార్జిషీట్‌లో వివరాలంతా అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో కేసును సీబీఐకి అప్పగించడమే సమంజసంగా ఉంటుందని ముగ్గురు పిటిషనర్లు పేర్కొన్నారు. అదే సమయంలో ఈ కేసు అంటరానితనం నిరోధక చట్టం పరిధిలోకి రాదు కనుక కేసు విచారణను మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేయాలని సీబీసీఐడీ పిటిషన్ వేసింది. ఈ రెండు పిటిషన్లపై వాద ప్రతివాదనలు ముగియడంతో సోమవారం ఉదయం మేజిస్ట్రేట్ వసంతి తీర్పు వెలువరించారు. సీబీసీఐడీ సమర్పించిన ఛార్జిషీటును అంగీకరిస్తున్నామని, ఈ కేసు అంటరానితనం నిరోధక చట్టం పరిధిలోకి రాదు కనుక కేసు తదుపరి విచారణను పుదుకోట జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు-2కు బదలీచేస్తూ మేజిస్ట్రేట్ ఉత్తర్వు జారీ చేశారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి

● 8న డీఎంకే నిరసన సభలు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి పథకాలు ప్రకటించకపోవడం, అమలులో ఉన్న ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు జరుపనందుకు నిరసనగా ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన సభలు జరపాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఆయా జిల్లా కేంద్రాల్లో ఈ నెల 8 సాయంత్రం ఆరుగంటలకు నిరసన సభలు నిర్వహించి, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగినట్లు ప్రజలలో అవగాహన కల్పించాలని కూడా విజ్ఞప్తి చేసింది.

మాజీమంత్రి కేసు విచారణ మళ్లీ వాయిదా

ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డాక్టర్ సి.విజయ్‌భాస్కర్‌కు వ్యతిరేకంగా దాఖలైన అక్రమార్జన కేసు విచారణ మళ్లీ వాయిదా పడింది. పుదుకోట జిల్లా విరాలిమలై నియోజకవర్గ అన్నాడీఎంకే ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న విజయ్ భాస్కర్‌పై ఏసీబీ అక్రమార్జన కేసు నమోదు చేసింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో మంత్రిగా వ్యవహరించిన ఆయన ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే ఆరోపణలతో ఏసీబీ దాఖలు చేసిన ఈ కేసు పుదుకోట జిల్లా ప్రిన్సిపల్ సెషెన్స్‌కోర్టులో కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో ఏసీబీ అధికారులు ఛార్జ్‌షీటు కూడా దాఖలు చేశారు. సోమవారం కోర్టులో జరిగిన ఈ కేసు విచారణకు ముద్దాయిలుగా ఉన్న విజయ్ భాస్కర్ ఆయన భార్య రమ్యా హాజరుకాలేదు. ఇందువల్ల ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకు వాయిదా వేస్తూ పుదుకోట జిల్లా ప్రిన్సిపల్ సెషెన్స్‌కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

ఆదివాసీ గ్రామాల్లో నక్సల్స్ నిరోధక శిబిరాలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో అధికారులు ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. నీలగిరి జిల్లాలో నక్సల్స్ నిరోధక చర్యల్లో భాగంగా ఆదివాసీ గ్రామాల్లో జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా పందలూరు సమీపంలోని సందనశిర, సోరియన్‌కాపు తదితర ప్రాంతాల్లో ఆదివారం ఈ శిబిరాలు జరిగాయి. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి వాసుదేవన్, సబ్ కలెక్టర్ కన్నన్, సీఐ సెంథిల్ కుమార్ పాల్గొని, తమ తమ శాఖలు అందిస్తున్న పథకాలు, సంక్షేమ సహాయాలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిలో విద్యుత్ కనెక్షన్ లేని ఇళ్లకు సత్వరం ఉచిత కనెక్షన్లను అధికారులు ప్రారంభించారు. గ్రామాల్లో అనుమానంగా వ్యక్తుల సంచారం ఉంటే వెంటనే సమాచారం అందించాలని, బయట వ్యక్తులకు రాత్రి సమయాల్లో ఆశ్రయం కల్పించరాదని అధికారులు ప్రజలకు సూచించారు.

పూజలో ఉంచిన కొబ్బరికాయ.. రూ.66వేలకు వేలంలో దక్కించుకున్న భక్తుడు

ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్‌లోని ఆలయంలో పూజల్లో ఉంచిన ఓ టెంకాయను వేలంపాటలో పాల్గొన్న ఓ భక్తుడు దానిని రూ.66వేలకు దక్కించుకున్నాడు. ఈరోడ్ నగర పరిధిలోని గణపతిపాళయంలోని పచ్చంపాలయం ప్రాంతంలో మహా మారియమ్మ ఆలయంలో తైమాసం సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గత నెల 21న ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో అమ్మవారికి ప్రతిరోజు పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగల్ వండి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. అలాగే భక్తులు అమ్మవారి అనుగ్రహం కోసం రకరకాల కానుకలు సమర్పించారు. వీటిని అమ్మవారి పాదాల చెంత వుంచిన ఆలయ పూజారులు విశేషపూజలు నిర్వహించిన అనంతరం వేలం వేశారు. ఇందులో పాల్గొన్న ఓ భక్తుడు టెంకాయను రూ.66వేలకు దక్కించుకుని భక్తిని చాటుకున్నాడు.

ప్యాసింజర్ బోట్ల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన మేరకు కొత్తగా మూడు ప్యాసింజర్ బోట్లు కొనుగోలుకు పుంపుహార్ షిప్పింగ్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. ఆసక్తి కలిగిన సంస్థలు ఈ నెల 13వ తేదిలోపు తమ కార్యాలయంలో టెండర్లు దాఖలుచేయవచ్చని సంస్థ సూచించింది. ప్రస్తుతం ఈ సంస్థ కన్నియాకుమారి బోట్ స్టేషన్ నుంచి తిరువళ్లువర్ విగ్రహం వరకు మూడు ప్యాసింజర్ బోట్లు నడుపుతోంది. 2023-24వ సంవత్సరంలో మూడు బోట్ల ద్వారా 21,13,829 మంది పర్యాటకులు ప్రయాణించగా సంస్థకు రూ.23.11 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఈ నేపథ్యంలో, ఇటీవల కన్నియాకుమారిలో పర్యటించిన సీఎం, పర్యాటకుల సౌకర్యార్థం బోటు సేవలు పెంచుతామని ప్రకటించారు. పుంపుహార్ సంస్థ కొత్త బోట్ల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించింది.

మహిళా ఏడీజీపీ ప్రాణాలకే గ్యారెంటీ లేదు

● ఈపీఎస్ విమర్శ

ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ద్రావిడ మోడల్ ప్రభుత్వంలో మహిళా ఏడీజీపీ ప్రాణాలకే గ్యారెంటీ లేదని, ఇది పోలీసు శాఖకు మాయనిమచ్చ అని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి వ్యాఖ్యానించారు. తమిళనాడు యూనిఫార్మ్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎన్‌యూఎస్సార్బీ)లో జరుగుస్తున్న అవకతవకల గురించి మాట్లాడిన తనను హతమార్చాలనే ఉద్దేశంతో తన కార్యాలయంపై దాడి జరిగిందని ఐపీఎస్ అధికారి, ఏడీజీపీ కల్పన నాయక్ డీజీపీకి ఫిర్యాదు చేయడంపై ఈపీఎస్ స్పందించారు. ఆయన సోమవారం తన ఎక్స్‌పేజీలో పోస్ట్ చేసిన వివరాలిలా ఉన్నాయి. ప్రజలకు భద్రత కల్పించే పోలీసు శాఖలో ఏడీజీపీ ప్రాణాలకే గ్యారెంటీ లేని పరిస్థితి ఉదని తెలిపారు. ఏడీజీపీ కల్పన నాయక్‌కు తగిన పోలీసు భద్రత కల్పించడంతో పాటు ఆమె ఆరోపణలపై పారదర్శకంగా విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా వుండగా మహిళా ఏడీజీపీ కల్పన నాయక్ కార్యాలయంపై జరిగిన దాడికి సంబంధించి విచారణను సీబీఐకు అప్పగించాలని పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో మరో 963 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తరణ

● పెరగనున్న టోల్‌గేట్లు

ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాప్తంగా ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి జాతీయ రహదారుల శాఖ రోడ్ల విస్తరణ పథకంలో భాగంగా మెగా ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో మరో 963 కిలోమీటర్ల మేర ఫోర్ లేన్ గా విస్తరించనున్నారు. ఇందువల్ల రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 72 టోల్‌గేట్ల సంఖ్య 90కు పెరగనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 6,805 కిలోమీటర్ల మేర రహదారులున్నాయి. వీటిలో 1,282 కిలోమీటర్ల మేర డబల్ వే, 2,383 కిలోమీటర్లు లింక్ రోడ్లతో డబల్‌వే ఉంది. 384 కిలోమీటర్ల వరకు సిక్స్‌వే, 28 కిలోమీటర్ల ఎనిమిది లేన్ల రోడ్లు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 2,735 కిలోమీటర్ల మేరకు ఫోర్ వే రోడ్ల స్థాయి పెంచేందుకు జాతీయ రహదారుల శాఖ కమిషన్ నిర్ణయించింది. అదనంగా 963 కిలోమీటర్ల దూరానికి కొత్తగా నాలుగు రహదారుల నిర్మాణం కోసం రూ.20వేల కోట్లతో ప్లాన్ సిద్ధంచేసింది. దీని ప్రకారం చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం - పుదుచ్చేరి వరకు (106కి.మీ), దిండుగల్ - పొల్లాచ్చి (131.9కి.మీ), నాగపట్నం - తంజావూర్ (65కి.మీ), విల్లుపురం - నాగపట్నం (125కి.మీ), విక్రవాండి - తంజావూర్ (163కి.మీ), గుడిపాల - శ్రీపెరుంబదూర్ (106కి.మీ) ప్రాంతాతల మధ్య రోడ్లు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం దిండుగల్ - తేని - కుమిలి మధ్య 135కి.మీ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు 30శాతానికి పైగా పూర్తయ్యాయి. రోడ్ల విస్తరణ పథకం అమల్లోకి వస్తే ప్రస్తుతం ఉన్న రాష్ట్ర రహదారుల్లో 72గా ఉన్న టోల్‌గేట్ల సంఖ్య 90కి పెరుగుతుందని అధికారులు తెలిపారు.

ధర తగ్గడంతో బీట్‌రూట్ రైతుల ఆవేదన



చెట్ల నుంచి కాయలు వేరు చేస్తున్న కార్మికులు

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీట్ రూట్ ధరలు హఠాత్తుగా తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేని జిల్లా ఆండిపట్టి సమీపం వెల్లయదేవన్‌పట్టి, అనైకరైపట్టి, ధర్మత్తుపట్టి సహా పలు గ్రామాల్లో రైతులు అధికంగా బీట్ రూట్ సాగు చేస్తుంటారు. రెండు నెలల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం కోతకు వచ్చాయి.. ఈ క్రమంలో, కొద్దిరోజులుగా బీట్ రూట్ ధరలు తగ్గుతూ ప్రస్తుతం కిలో రూ.10-రూ.15 పలుకుతోంది. ఈ విషయమై రైతు బాలమురుగన్ మాట్లాడుతూ... తేని జిల్లాలో పండించే బీట్ రూట్‌ను చెన్నై, మదురై సహా పలు నగరాల్లో మార్కెట్‌కు తరలిస్తుంటామన్నారు. కొద్దిరోజుల క్రితం కిలో రూ.60 ధర పలికిన నేపథ్యంలో, ప్రస్తుతం మార్కెట్లోకి బీట్ రూట్ దిగుమతులు పెరడంతో కిలో రూ.15-20 మాత్రమే పలుకుతోందని, ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా రావని బాలమురుగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

యంత్రం కోసం కలెక్టర్ ఆర్థికసాయం



యంత్రం కొనుగోలుకు ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్

వేలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి బీడీఓ కార్యాలయంలో సోమవారం దివ్యాంగుల గ్రీవెన్స్ జరిగింది. మాతాండ గ్రామానికి చెందిన రవిచంద్రన్ తన కుమారుడికి శ్వాస చికిత్స కోసం బైపేప్ యంత్రం కొనుగోలుకు సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సత్వరం స్పందించిన కలెక్టర్, యంత్రం కొనుగోలుకు తన సొంత డబ్బులు రూ.50 వేల చెక్ రవిచంద్రన్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, సబ్ కలెక్టర్ (శిక్షణ) రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **చిన్మయ నగర్:** సాయి నగర్, కాళియమ్మన్ ఆలయ వీధి, వెస్ట్ నటేశన్ నగర్, పచ్చైయమ్మన్ ఆలయ వీధి, గంగైయమ్మన్ ఆలయ వీధి, ఇళంగో నగర్, సాయిబాబా కాలని, రత్న నగర్, తారాచంద్ నగర్, ఎల్ అండ్ టీ కాలని, సీఆర్ఆర్ పురం, వినాయగం అవెన్యూ, కంబర్ వీధి, గాంధీ వీధి, రాఘవేంద్ర కాలని, వారియర్ వీధి, ఇంద్ర నగర్, రాజీవ్ గాంధీ వీధి, కన్నగై వీధి, గ్రహలక్ష్మి అపార్ట్‌మెంట్స్ సంజయ్ గాంధీ నగర్, వాయుపుత్ర వీధి, ఇళంగో నగర్ సౌత్, బాలాంబాళ్ నగర్, తంగల్ వీధి, రెడ్డి వీధి కొంత భాగం, స్కూల్ రోడ్డు, జైన్ అపార్ట్‌మెంట్, కృష్ణ నగర్ 4వ వీధి, బాలాజి నగర్, ఎస్‌బీఐ కాలని 1 నుంచి 4 ప్రాంతాలు, పీఏ కాలని, మేట్టుకుప్పం, భువనేశ్వరి నగర్

పుళల్: సూరాపేట, రెడ్‌హిల్స్ మార్కెట్, కావాంగరై, షణ్ముగపురం, కదిర్‌వేడు, పుత్తాగరం, మెట్రో వాటర్ పుళల్, పుళల్ జైలు 1 నుంచి 3 పార్ట్‌లు

పోరూర్: వైర్‌లెస్ స్టేషన్ రోడ్డు, ఆర్ఈ నగర్ 5వ వీధి, జయభారతి నగర్, రామకృష్ణ 1 నుంచి 7 అవెన్యూలు, రమ్య నగర్, ఉదయ నగర్, గురుస్వామి నగర్, రాజరాజేశ్వరి నగర్, సంతోష్ నగర్, గోవింద రాజ నగర్, కావ్య గార్డెన్, రామసామి నగర్

కాట్టుపాక్కం: అన్నై ఇందిరా నగర్, పుష్ప నగర్, విజయలక్ష్మి నగర్, పావేందర్ నగర్, రాందాస్ నగర్, లక్ష్మి నగర్, ఇందిరా నగర్ కొంత భాగం

సెంబియం: కావేరి రోడ్డు 1 నుంచి 8 వీధులు, తండయార్‌పేట హైరోడ్డు, పెరంబూర్, కొడుంగైయూర్, జీఎన్‌టీ రోడ్డు, గాంధీ నగర్, బీబీ రోడ్డు, మాధవరం కొంత భాగం

పల్లావరం: పాత పల్లావరం, జమీన్ పల్లావరం, త్రిశూలం, రాజాజీ నగర్, మల్లిగ నగర్, మాలగంధపురం, భారతి నగర్, పచ్చయప్పన్ కాలని, కంటోన్మెంట్ పల్లావరం, జీఎస్‌టీ రోడ్డు శుభం నగర్, ముత్తమిళ్ నగర్, మూంగిల్ ఏరి, భవాని నగర్, పెరుమాళ్ నగర్, కృష్ణా నగర్ కొంత భాగం, దుర్గ రోడ్డు, పల్లవ గార్డెన్, పీవీ వైద్యలింగం రోడ్డు, ఈశా పల్లావరం, ఆఫీసర్స్ లైన్.

తిరుత్తణి ఆలయంలో అన్నాదురై వర్ధంతి



మహిళలకు దుస్తులు అందిస్తున్న ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమణి

తిరుత్తణి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై 56వ వర్ధంతిని తిరుత్తణిలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అన్నాదురై విగ్రహానికి నివాళులర్పించిన నేతలు, సుబ్రమణ్యస్వామి ఆలయంలో సహపంక్తి ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భాగంగా భక్తులకు ఆలయం తరఫున జాయింట్ కమిషనర్ రమణి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కందన్, ట్రస్టీలు వి.సురేష్‌బాబు, ఎం.నాగన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఖాళీ మద్యం సీసాల కొనుగోళ్లు ...

రూ. కోటి డిపాజిట్

● కాంట్రాక్టర్లకు టాస్మాక్ సంస్థ ఉత్తర్వులు

ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఖాళీ మద్యం సీసాలు కొనుగోలు చేసేందుకు వచ్చే కాంట్రాక్టర్లు రూ.కోటి డిపాజిట్ చేయాలని టాస్మాక్ సంస్థ సూచించింది. రాష్ట్రంలో ఖాళీ మద్యం సీసాలను బహిరంగ ప్రాంతాల్లో పడేసి వెళ్తున్నందునఏర్పడే సమస్య గుర్తించిన మద్రాస్ హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలకు దిగింది. ఆ మేరకు టాస్మాక్ సంస్థ 2024వ సంవత్సరంలో ఖాళీ మద్యం సీసాలను తిరిగి తీసుకునే పథకాన్ని ప్రారంభించింది. టాస్మాక్ దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసే సమయంలో ఒక్కో సీసాకు అదనంగా రూ.10 చెల్లించాల్సివుంటుంది. మళ్లీ ఆ సీసాను వెనక్కి ఇస్తే.. ఆ రూ.10 తిరిగిచ్చేస్తారు. ఈ విధానం నీలగిరి, తేని, ధర్మపురి, కోవై, తిరువారూర్, నాగపట్నం, కన్నియాకుమారి జిల్లాల్లో మాత్రమే ప్రస్తుతం అమలులో వుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవాప్తంగా మిగిలిన జిల్లాలకు కూడా విస్తరింపజేయాలని నిర్ణయించిన టాస్మాక్ సంస్థ ఖాళీ సీసాల కొనుగోలుచేసేందుకు గత నెల 31న ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహానించింది. మార్చి 6వ తేదీ సాయంత్రం 5గంటలకు టెండర్లు పరిశీలించి, పాల్గొనే కాంట్రాక్టర్లకు 40 నిబంధనలను విధించనుంది. కాంట్రాక్టర్లు దరఖాస్తుతో పాటు రూ. కోటి డిపాజిట్ చెల్లించాల్సివుంటుంది.

తల్లీకొడుకుల అనుమానాస్పద మృతి

● నీటి తొట్టెలో తేలిన మృతదేహాలు



ముగ్గురి ప్రాణాలు బలిగొన్న అండర్ వాటర్ ట్యాంక్

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లాలో నీటి తొట్టెలో పడి తల్లి, ఇద్దరు కుమారులు మృతిచెందారు. నామక్కల్ జిల్లా కొళత్తుపాళయం ప్రాంతానికి చెందిన రవికుమార్ రాశిపురం తిరువళ్లువర్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గౌరవ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇందుమతి (29), యాద్విక్ అరియన్ (3), నివిన్ (1) అనే కుమారులున్నారు. వేలగౌండమ్‌పట్టి సమీపంలోని కులదేవత ఆలయానికి వెళ్లేందుకు, ఇందుమతి తన ఇద్దరు కుమారులతో నామక్కల్ పొదుపట్టి అన్నానగర్ కాలనీలో ఉన్న పుట్టింటికి వచ్చింది. ఆమె పుట్టింట అండర్ వాటర్ ట్యాంక్ ఉంది. ఈ తొట్టెలో యాద్విక్ అరియన్ మృతిచెందిన కనిపించాడు. మనుమడి కోసం పావాయి గాలిస్తున్న తరుణంలో, తొట్టెలో శవమై కనిపించడంతో బోరున విలపించింది. మృతదేహాన్ని నామక్కల్ ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అయితే ఎంతసేపటికీ తన కుమార్తె ఇందుమతి, రెండో మనవడు నివిన్ కనిపించకపోవడంతో అనుమానంతో అదే తొట్టెలో గాలించారు. దాంతో ఆ తొట్టెలో తల్లీకొడుకుల మృతదేహాలు కూడా బయల్పడ్డాయి. ఈ ఘటనపై నామక్కల్ పోలీసులు కేసు నమోదుచేసి, వీరు ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేక ప్రమాదవశాత్తు తొట్టెలో పడి మృతిచెందారా? అనే కోణాల్లో విచారిస్తున్నారు.

ముమ్మరంగా కోళ్లకు టీకాలు



కోళ్లకు టీకాలు వేస్తున్న సిబ్బంది

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 14వ తేది వరకు కోళ్లకు టీకాలు వేస్తుంటారు. రైతులు పెంచుతున్న కోళ్లకు అతిసార వ్యాధి సోకితే కోళ్లకు ఆయాసం, జ్వరం, కాళ్ల వణకడం, ఆకుపచ్చ, తెలుపు రెట్టలు రావడం, ఒక్కో సారి పెద్ద సంఖ్యలో చనిపోవడం జరుగుతుంటాయి. కోళ్లకు ఈ రోగాలు అడ్డుకొనేలా ఈ ఏడాది టీకాల కార్యక్రమం ఈ నెల 1న ప్రారంభమైంది. తిరుత్తణి రెవెన్యూ కార్యాలయ పరిధిలోని గ్రామాల్లో పశుసంవర్థక శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కోళ్లకు టీకాలు వేస్తున్నారు. ఈ పనులు 14వ తేది వరకు జరుగుతాయని, తిరుత్తణి పరిధిలో 71,400 టీకాలు వేయనున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.దామోదరన్ తెలిపారు.

మళ్లీ విరుచుకుపడ్డ లంక నావికాదళం

● పది మంది జాలర్ల అరెస్టు



అరెస్టయిన జాలర్లు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం వారంలోపే మళ్ళీ జాలర్లపై విరుచుకుపడింది. తమ దేశ సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారంటూ దాడి చేసి, రామేశ్వరం జిల్లా తంగచ్చిమఠంకు చెందిన పది మంది జాలర్లను అరెస్టు చేసింది. మరపడవ, అందులోని చేపలు, వలలు, జీపీఎస్ పరికరాలను కూడా స్వాధీనం చేసుకుంది. గత వారం సముద్రంలో చేపలవేటకు వెళ్ళిన కారైక్కాల్ ప్రాంతానికి చెందిన 13 మంది జాలర్లపై శ్రీలంక నావికాదళం తుపాకితో బెదిరించి అరెస్టుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం రామేశ్వరం మండపం దక్షిణ సముద్రతీర ప్రాంతంలో 171 మరపడవలలో 1200 మందికి పైగా జాలర్లు మత్స్యశాఖ అనుమతితో సముద్రంలో చేపలవేటకు వెళ్ళారు. ధనుష్కోడి - తలైమన్నార్ ప్రాంతాల నడుమ వీరంతా చేపలు పడుతుండగా సోమవారం వేకువజామున అక్కడికి గస్తీ నౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం అన్ని పడవలను చుట్టుముట్టేందుకు ప్రయత్నించింది. ఆ లోపున జాలర్లందరూ చేపలవేట ఆపేసి తిరుగుముఖం పట్టారు. అదే సమయంలో తంగచ్చిమఠం నూసైయప్పర్ పట్టినం ప్రాంతానికి చెందిన సంధ్యాసతీష్ (30)కి చెందిన మరపడవను శ్రీలంక నావికాదళం చుట్టుముట్టి జాలర్లపై దాడులకు పాల్పడింది. ఎప్పటిలాగే తమ దేశ సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారంటూ పడవలో ఉన్న 10 మంది జాలర్లను నిర్బంధించి శ్రీలంకలోని తాయ్‌వుప్పాడు రేవుకు తరలించింది. జాలర్లు చేపలవేటకు ఉపయోగించిన మరపడవను, అందులోని మత్స్య సంపదను, జీపీఎస్ పరికాలను కూడా స్వాధీనం చేసుకుంది.

పోలీస్ స్టేషన్‌పై పెట్రో బాంబు దాడి

రాణిపేటలో అర్ధరాత్రి కలకలం ● ఓ నిందితుడి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాణిపేట సమీపంలో చెన్నై - బెంగుళూరు జాతీయ రహదారిని ఆనుకునివున్న డీ-5 సిప్‌కాట్ పోలీస్ స్టేషన్‌పై ఆదివారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. అదృష్టవశాత్తు ఈ దాడిలో ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. ఈ సంఘటనకు సంబంధించి పది మంది అనుమానితులను పోలీసులు విచారణ జరుపుతున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి ముసుగులు వేసుకున్న ఇద్దరు పోలీస్ స్టేషన్ రిసెప్షన్, విజిటర్స్ కూర్చొనే ప్రాంతంలో పెట్రోల్ బాంబులను విసిరివేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు సిబ్బంది మంటలు ఆర్పివేశారు. అలాగే, ఈ ఠాణాకు ఎదురుగా ఉన్న ఒక బియ్యం దుకాణంపై కూడా గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబులు విసిరివేసి పారిపోయారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లా సంఘటనా స్థలానికి చేరుకుని ఠాణాను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ ముసుగు దొంగలను గుర్తించి అరెస్టు చేసేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఆయన ఏర్పాటు చేశారు. పాత నేరస్తులు, అధిక కేసులు పెండింగ్‌లో ఉన్న నిందితులే దీనికి పాల్పడివుంటారని పోలీసులు భావిస్తున్నారు. దీంతో సిప్‌కాట్ పోలీస్ స్టేషన్ పరిధి, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఇదిలావుంటే, ప్రత్యేక బృందం పోలీసులు.. పది మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నిందితుడి అరెస్టు

ఈ పెట్రోల్ బాంబు దాడి కేసులో నిందితుల్లో ఒకరైన హరి అనే వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిపై పోలీసులు కాల్పులు జరపగా గాయపడ్డాడు. నిందితుడును అరెస్టు చేసి ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.


'బ్యాడ్‌గర్ల్'లో అంజలి శ్రీనివాసన్

వివాదంలో 'బ్యాడ్‌గర్ల్'

● నిషేధించాలంటూ డిమాండ్లు

గ్రాస్ రూట్ బ్యానరుపై దర్శకుడు వెట్రిమారన్ - బాలీవుడ్ దర్శక నిర్మాత నటుడు అనురాగ్ కశ్యప్ నిర్మాణంలో వర్షా భరత్ దర్శకత్వంలో తెరకెక్కిన 'బ్యాడ్‌గర్ల్' మూవీని నిషేధించాలన్న డిమాండ్లు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయి. ఇటీవల ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేయగా, తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంటుంది. టీజర్‌లోనే అనేక వివాదాస్పద అంశాలను పొందుపరిచారని, సినిమాలో ఎలాంటి సన్నివేశాలుంటాయన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా బ్రాహ్మణుల సంప్రదాయాలను కించపరిచేలా, పాఠశాలలో చదువుకునే ఓ విద్యార్థిని సహ విద్యార్థులను ఉద్దేశించి కామెంట్స్ చేయడం వంటి అంశాలు ఈ టీజర్‌లో ఉన్నాయంటున్నారు. అలాగే, శృంగారంలో 18 యేళ్ళు నిండిన పాఠశాల విద్యార్థులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, బాలికల ఆత్మహత్యా బెదిరింపులు వంటి అనేక వివాదాస్పద సన్నివేశాలతో ఈ టీజర్ ఉంది. ఇలాంటి చిత్రంపై దర్శకులు వెట్రిమారన్, పా.రంజిత్, నటుడు విజయ్ సేతుపతి మాట్లాడుతూ, మహిళలకు స్వేచ్ఛ అనే పేరుతో వచ్చిన ఈ మూవీ ఒక విప్లవాత్మక సినిమాగా పేర్కొనడాన్ని కూడా పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇలాంటి సినిమా నిర్మించిన, నటించిన దర్శకనిర్మాతలు, నటీనటులు వారివారిళ్ళలో ఉండే ఆడపిల్లలు చెడు తిరుగుళ్ళ తిరిగితే అంగీకరిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. కుటుంబ వ్యవస్థతో పాటు తల్లిదండ్రులు - పిల్లల మధ్య సంబంధాలకు హాని కలిగించేలా పాఠశాల, విద్యా వ్యవవస్థను నిర్వీర్యం చేసేలా ఉందంటున్నారు. అందువల్ల ఈ సినిమా విడుదలకాకుండా నిషేధించాలని అనేక మంది డిమాండ్ చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు ఉండటంతో ఈ సినిమా వివాదంలో చిక్కుకునే పరిస్థితి నెలకొంది.

'రెట్రో'లో శ్రియ స్పెషల్ సాంగ్




'కంగువా' వంటి భారీ డిజాస్టర్ మూవీ తర్వాత హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'రెట్రో' నుంచి ఫస్ట్ సింగిల్‌ను ఈ నెల 14వ తేదీ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేయున్నారు. ఈ గీతంలో సీనియర్ నటి శ్రియ నర్తించారు. హీరోయిన్‌గా పూజా హెగ్డే నటించినప్పటికీ ఈ ప్రత్యేక గీతం కోసం శ్రియను ఎంపిక చేశారు. మే 1న విడుదలకానున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం. యాక్షన్ మిక్స్‌డ్ లవ్ స్టోరీగా రూపొందుతున్న మూవీ టీజర్ తాజాగా రిలీజ్ చేయగా, మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రేమికుల దినోత్సవం రోజున సూర్య - శ్రియ కలిసి చేసిన ఐటమ్ సాంగ్ రిలీజ్ చేయనున్నారు. కార్తీక్ సుబ్బురాజ్ దర్శకుడు. ఈ మూవీ తర్వాత హీరో సూర్య తన 45వ చిత్రాన్ని ఆర్జే బాలాజీ దర్శకత్వంలో రూపొందిస్తున్న విషయం తెల్సిందే.

● శింబు బర్త్‌డే స్పెషల్

ఒకే రోజు 3 సినిమాలపై ప్రకటన

తమిళ చిత్రపరిశ్రమలో లిటిల్ సూపర్‌స్టార్‌గా ప్రతి ఒక్కరూ ముద్దుగా పిలుచుకునే అభిమాన హీరో శింబు అలియాస్ శిలంబరసన్ అలియాస్ ఎస్‌టీఆర్. తన పుట్టిన రోజు వేడుకలను ఫిబ్రవరి 3వ తేదీ మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తన 49వ చిత్రంపై ప్రకటన చేశారు. 'పార్కింగ్' ఫేం రామ్‌కుమార్ బాలకృష్ణన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. డాన్ పిక్చర్స్ పతాకంపై ఆకాష్ భాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందే ఈ మూవీకి సంబంధించిన విడుదల చేసిన పోస్టరులో.. 'ది మోస్ట్ వాంటెడ్ స్టూడెంట్' అని రాసి ఉన్న రక్తపు మరకల కత్తిని ఇంజనీరింగ్ పుస్తకంలో దాచినట్టుగా డిజైన్ చేశారు. అంటే ఈ మూవీలో శింబు ఇంజనీరింగ్ విద్యార్థిగా నటించనున్నారనే విషయాన్ని ఈ పోస్టరు నిర్ధారిస్తుంది. కాగా, శింబు చివరగా నటించిన మూవీ 'పత్తుతల'. ఆ తర్వాత అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో 'ఓ మై కడవులే' సినిమాలో నటించనున్నట్టు ప్రకటించారు. కానీ, ఇంకా సెట్స్‌పైకి తీసుకెళ్ళలేదు. అశ్వత్ తెరకెక్కిస్తున్న 'డ్రాగన్' పూర్తి చేసిన తర్వాత శింబు మూవీ మొదలుపెట్టనున్నారు. అలాగే స్వీయ నిర్మాణంలో ఆత్మాన్ సినీ ఆర్ట్స్ పతాకంపై తన 50వ చిత్రాన్ని కూడా బర్త్‌డే స్పెషల్‌గా శింబు ప్రకటించారు. దేశింగు పెరియస్వామి దర్శకత్వం వహించే ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం. అలాగే, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ కూడా శింబు 51వ చిత్రాన్ని నిర్మించనున్నట్టు అధికారికంగా ప్రకటించింది. ఇదిలా వుంటే, సోమవారం పుట్టిన రోజు జరుపుకున్న శిలంబరసన్‌కు పలువురు నటీనటులు, సినీ ప్రముఖులు, అభిమానులు బర్త్‌డే విషెస్ చెపుతూ ట్వీట్స్ చేశారు.



'ఎస్‌టీఆర్-49'లో శింబు

పెళ్ళిపీటలెక్కిన హీరో, దర్శకుడు


కిషన్ దాస్ - సుచిత్ర దంపతులు

తమిళ చిత్రజ్యోతి

2022లో దర్శక శివ దర్శకత్వంలో వచ్చిన 'ముదల్ నీ ముడివుం నీ' అనే చిత్రంలో హీరోగా నటించిన కిషన్ దాస్ ఓ ఇంటివాడయ్యారు. తన చిన్ననాటి ప్రియురాలు సుచిత్రను వివాహం చేసుకున్నారు. ఈయన వివాహం ఇటీవల జరుగగా, ఫొటోలను తాజాగా తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. కిషన్ దాస్ - సుచిత్ర దంపతులకు పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు చెబుతున్నారు. కాగా, ఇటీవల కిషన్ దాస్, మీతా రఘునాథ్ జంటగా నటించిన 'తరుణం' విడుదలైంది. ఈ నేపథ్యంలో ఆయన గుట్టుచప్పుడుకాకుండా, జనవరి 31న వివాహం చేసుకున్నారు.. అలాగే, కోలీవుడ్ దర్శకుడు ఎస్.యు.అరుణ్ కుమార్ కూడా పెళ్ళిపీటలెక్కారు. ఈయన అశ్విని అనే యువతిని వివాహం చేసుకున్నారు. మదురైలో జరిగిన ఈ పెళ్ళికి హీరోలు చియాన్ విక్రమ్, విజయ్ సేతుపతి, సిద్ధార్థ్, దర్శకులు వెట్రిమారన్, ఎస్‌జే సూర్య, విఘ్నేష్ శివన్, శశి వంటి అనేక మంది ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.


అరుణ్ కుమార్ - అశ్విని వివాహానికి హాజరైన సినీ ప్రముఖులు

కేంద్ర సర్వీసులకు రాజేష్ లఖాని



ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 33ఏళ్లుగా వివిధ ప్రభుత్వ శాఖల్లో సేవలందించిన సీనియర్ ఐఏఎస్ అధికారి రాజేష్ లఖాని కేంద్ర సర్వీసులకు బదిలీ అయ్యారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన రాజేష్ లఖాని 1992వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. అదే సంవత్సరం ఆయన ధర్మపురి అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2003 నుండి 2004వ సంవత్సరం వరకు కన్నియాకుమారిలో, 2005 నుండి 2006వరకు తేని కలెక్టర్‌గా పని చేశారు. అలా అంచెలంచెలుగా పదోన్నతిపొందిన ఆయన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా, సిప్కాట్, పర్యాటక అభివృద్ధి శాఖ కార్యదర్శిగా పనిచేశారు. 2016 నుంచి 2018 వరకు రాష్ట్ర ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు.. ఆ తర్వాత గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా, తమిళనాడు విద్యుత్ బోర్డు ఛైర్మెన్‌గా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న రాజేష్ లఖాని రెవెన్యూ, విపత్తుల నివారణ మేనేజిమెంట్ శాఖ కమిషనర్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో 33ఏళ్లుగా రాష్ట్రంలో ఉత్తమ సేవలందించిన రాజేష్ లఖాని కేంద్రప్రభుత్వ విద్యాశాఖ నిర్వహణలో ఉన్న నవోదయ విద్యాలయ సమితి కమిషనర్‌గా కేంద్రప్రభుత్వం నియమించింది.

ప్రపంచంలోనే ఎత్తైన నంది విగ్రహానికి కుంభాభిషేకం


కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన నంది విగ్రహానికి ఆదివారం కుంభాభిషేకం జరిగిగింది. సేలం జిల్లా వాళప్పాడి, వెల్లాల్‌గుండంలో ఉన్న రాజలింగేశ్వర శివాలయంలో 45 అడుగుల ఎత్తైన మహా అధికార నంది విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం మూడేళ్లుగా జరుగుతోంది. అందులో ప్రత్యేక అంశంగా, నంది విగ్రహం కడుపులోకి ప్రవేశించి కొండపై నుంచి దర్శించేలా 15 అడుగుల ఎత్తున శివుడు, 18 మంది సిద్ధులు, భైరవుడు, శివలింగం ఏర్పాటుచేశారు. ఈ విగ్రహం కుంభాభిషేకానికి గత నెల 20వ తేది ముహూర్తపురాట వేశారు. ఆదివారం ఉదయం క్షీర కలశాల ఊరేగింపు, దివ్య జ్యోతి వెలిగింపు, విఘ్నేశ్వర, నవగ్రహ, ధన్వంతరి, లక్ష్మీ పూజలు, సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ గోపుర కలశాలపై పుణ్యజలాలు ప్రోక్షించి కుంభాభిషేకం జరిపారు. అనంతరం నంది విగ్రహానికి కూడా కుంభాభిషేకం చేశారు. తదుపరి స్వామివారికి అభిషేక అలంకరణ, నైవేద్యం, మహా దీపారాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

అమెరికా అమ్మాయి, తమిళ అబ్బాయి

● వైభవంగా ముగిసిన వివాహం


వధూవరులను ఆశీర్వదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

అడయార్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): అమెరికా అంత రిక్ష పరిశోధనా సంస్థ నాసాలో పనిచేస్తున్న తమిళ యువకుడు, అమెరికా యువతి ఒక్కటయ్యారు. వీరిద్దరి వివాహం తిరువణ్ణామలై జిల్లా సెంజిలోని ఒక ప్రసిద్ధ ఆలయంలో హిందూ సంప్రదాయం ప్రకారం జరిగింది. జిల్లాలోని చెయ్యారు తాలూకా అనకావూరు గ్రామానికి చెందిన భాస్కరన్ పెద్ద కుమారుడు అవినాష్ నాసాలో పని చేస్తున్నారు. అతడు అమెరికాకు చెదిన కేథరీన్ ఓసేవి అనే యువతిని ప్రేమించగా, రెండు కుటుంబ పెద్దల అనుమతితో వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. దీంతో తమ కుల దైవమైన సెంజిలోని ఏకాంబరేశ్వరాలయంలో వీరి వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. హిందూ సంప్రదాయం ప్రకారం జరిగిన ఈ వివాహంలో ఇరు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధుమిత్రులు పాల్గొని, వధూవరులను ఆశీర్వదించారు.

సీఐటీ నగర్‌లో హెరిటేజ్ దుకాణం ప్రారంభం

ప్యారీస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ సమీపంలోని సీఐటీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయబడిన హెరిటేజ్ దుకాణాన్ని అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్ సోమవారం ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ ఆర్సీ ఆర్ముగం కుమారుడు ప్రభాకరన్ ఏర్పాటుచేసిన హెరిటేజ్ హ్యాపీనెస్ పాయింట్ ప్రారంభోత్సవంలో అన్నాడీఎంకే నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


దుకాణాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సునీల్

వెల్లివిరిసిన మతసామరస్యం

● ఆలయ కుంభాభిషేకానికి ముస్లింల సారె


ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న ముస్లింలు

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆలయ కుంభాభిషేకానికి ముస్లిం సోదరులు సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ నిర్వాహకులకు అప్పగించారు. శివగంగ జిల్లా కారైకుడి అన్నా నగర్ ప్రాంతంలో హిందూ, ముస్లింల సహా పలు వర్గాల వారు నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలోని లలిత ముత్తుమారియమ్మన్ ఆలయ కుంభాబిషేకం సోమవారం జరిగింది. దీని కోసం అన్నా నగర్ ప్రాంతానికి చెందిన మసీదు జమాత్ తరఫున ముస్లింలు పండ్లు, పూలు సహా పలు వస్తువులు తాంబూళంలో ఉంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారిని సాదరంగా ఆహ్వానించారు. కుంభాభిషేకంలో ఇస్లామీయుల మహిళలు కూడా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దత్తపుత్రికకు వివాహం జరిపించిన ప్రభుత్వ కార్యదర్శి


వధూవరులతో డా.రాధాకృష్ణన్ దంపతులు

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార శాఖ కార్యదర్శి డా.రాధాకృష్ణన్, తన రెండవ దత్తపుత్రికకు నాగపట్టణం నెల్లుకడై మారియమ్మన్ ఆలయంలో వివాహం జరిపించారు. 2004వ సంవత్సరంలో రాధాకృష్ణన్ నాగపట్టణం జిల్లా కలెక్టర్‌గా వ్యవహరించిన సమయంలో, సునామీ విపత్తులో తల్లిదండ్రులను కోల్పోయిన రెండేళ్ల వయస్సున్న ఇద్దరు ఆడపిల్లలను దత్తత తీసుకొని, సౌమ్య, మీనా అనే పేర్లు పెట్టి, సంరక్షణ కేంద్రంలో ఉంచి చదివించారు. ఇద్దరికి 18 ఏళ్ల పూర్తయిన తర్వాత, వార్డెన్లు మలర్‌విలి-మణివణ్ణన్ దంపతులకు అప్పగించారు. సౌమ్యకు గత ఏడాది వివాహమైన నేపథ్యంలో, మీనాకు ఆదివారం వివాహమైంది. తల్లిదండ్రుల స్థానంలో తన భార్య, కుమారుడితో పాల్గొన్న రాధాకృష్ణన్ వివాహం జరిపించారు.

రూ.48.95 కోట్ల విద్యా రుణాల మాఫీ

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజనులు, క్రైస్తవ ఆదిద్రావిడ విద్యార్థులకు 1972-73 నుంచి 2002-3 వరకు వైద్యం, వైద్యం సంబంధిత సహా అన్ని కోర్సులు, 2003-4 నుంచి 2009-10 మధ్య కాలంలో వైద్యం, వైద్యం సంబంధిత కోర్సులకు సంబంధించి రూ.48.95 కోట్ల బకాయి రుణాలు మాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సచివాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... రుణ బకాయిలు విద్యార్థుల నుంచి వసూలు చేయకపోవడం, వసూళ్లకు సంబంధించి సరైన నమోదులేకపోవడం, వివరాలు కూడా కార్యాలయాల్లో లేకపోవడం, వసూలుచేయాల్సి వారిని గుర్తించకపోవడం తదితరాలతో రూ.48.95 కోట్లు రైట్ ఆఫ్ ప్రపోజల్) ప్రకారం రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.


అన్నాదురై వర్థంతి సందర్భంగా డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆధ్వర్యంలో మెరీనాబీచ్‌లో మౌనర్యాలీ నిర్వహిస్తున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు

బీసెంట్ నగర్ శాఖలో శక్తి లాకర్స్



అడయార్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్ నగర్ రెండో అవెన్యూలో ప్రముఖ శక్తి ఫైనాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఎస్ఎఫ్ఎస్ఎల్)కు చెందిన శాఖలో శక్తి లాకర్స్ పేరుతో డిపాజిట్ లాకర్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ లాకర్స్‌ను ఎస్ఎఫ్ఎస్ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శృతి బాలసుబ్రమణియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆభరణాలు, ఇతర వారసత్వ వస్తువులతో భావోద్వేగ అనుబంధాన్ని కలిగిన దేశ ప్రజలు బంగారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సహజంగానే విలువైన వస్తువులను భద్రపరచడం చాలా ముఖ్యమన్నారు. బంగారం, వెండి ధరలు పెరుగుతున్నందున వాటి భద్రతకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగా కస్టమర్లు తమ ఆభరణాలను సేఫ్టీ లాకర్లలో భద్రపరిచేందుకు ఇష్టపడతారన్నారు. ఇలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని బీసెంట్ నగర్ శాఖలో శక్తి లాకర్స్ పేరుతో సేఫ్టీ డిపాజిట్ లాకర్లను అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు.

ఇళయరాజాను కలిసిన రష్యన్ కళాకారులు

అడయార్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇండో - రష్యన్ ఫ్రెండ్‌షిప్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో 22వ రష్యన్ డ్యాన్స్ ఫెస్టివల్ గత నెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరానికి వచ్చిన రష్యన్ సంగీత కళాకారులు ఇసైజ్ఞాని ఇళయరాజాను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కోడంబాక్కంలోని ఇళయరాజా స్టూడియోలో ఇసైజ్ఞానిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇళయరాజా స్వరపరిచిన ఒక తమిళం, ఒక రష్యన్ పాటలకు వారు నృత్యం చేశారు. ఇదే విషయంపై ఇండో రష్యన్ ఫ్రెండ్‌షిప్ అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధి తంగప్పన్ మాట్లాడుతూ, 'ఈ యేడాది తమ పర్యటన ఎంతో ఆనందంగా జరిగిందన్నారు. ముఖ్యంగా ఇళయరాజా పాటలను తమ నృత్య బృందం ప్రదర్శించినపుడల్లా ప్రేక్షకులు ఎంతగానే ఎంజాయ్ చేశారని గుర్తు చేశారు. అలాగే, డాక్టర్ ఇళయరాజాతో సమావేశం మరుపురాని అనుభూతిని మిగిల్చిందన్నారు.




ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయం వద్ద సహపంక్తి కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి పీకే శేఖర్ బాబు తదితరులు


తిరువాన్మియూరు మరుదీశ్వరర్ ఆలయంలో సహపంక్తిలో పాల్గొన్న మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం

టెన్నికాయిట్ పోటీల్లో 'కేసరి' విద్యార్థుల సత్తా

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మైలాడుదురైలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలో టి.నగర్ కేసరి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్ -17 సింగిల్స్ విభాగంలో టీకే రాజేష్ రన్నర్‌గా నిలవగా, అండర్-14 సింగిల్స్ విభాగంలో కుమరన్ కాంస్య పతకాన్ని సాధించాడు. అదేవిధంగా జిల్లా స్థాయిలో అన్ని విభాగాల్లోనూ కేసరి పాఠశాల విద్యార్థులు విజయం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం విశేషం. వారిని సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న గోపాలయ్య

ప్రయాగ్‌రాజ్‌లో ఊంజల్‌సేవ



ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా సందర్భంగా టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయంలో సోమవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీనివాసస్వామికి ప్రత్యేక ఊంజల్‌సేవను నిర్వహించారు. స్వామివారు వీణాపాణియై సరస్వతి అలంకారంలో ఊయలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు అన్నమయ్య సంకీర్తలను ఆలపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


తిరుమలలో వార్షిక విశేషపూజ



తిరుమల శ్రీవారి ఆలయంలో వార్షిక విశేషపూజను సోమవారం వసంతపంచమి పర్వదినం సందర్భంగా నిర్వహించారు. గతంలో వారపు సేవగా విశేషపూజను నిర్వహించేవారు. అయితే శ్రీవారి ఉత్సవమూర్తుల అరుగుదలను అరికట్టేందుకు ఏడాదికోసారి మాత్రమే అభిషేకం నిర్వహించాలనే సూచనతో దీనితోపాటూ వసంతోత్సవం, సహస్ర కలశాభిషేకంలను వార్షిక సేవలుగా గత టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఈమేరకు తొలిసారి వార్షి విశేషపూజను సోమవారం శ్రీవారి ఆలయంలోని కల్యాణమండపంలో నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం ఈపూజలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పెరిగిన రద్దీ



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.34 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,706


తలనీలాలు సమర్పించినవారు: 23,340





నేడు సప్తవాహన సవారీ

- రథసప్తమికి ముస్తాబైన తిరుమల
- భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి



రథసప్తమి వేడుకల ఏర్పాట్లతో తిరుమల కొండ జగజ్జగేయమానంగా వెలిగిపోతోంది. విద్యుత్ దీపతోరణాలు, పూల అలకంకరణలు కనువిందుగా ఉన్నాయి. మంగళవారం ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఏడు వాహనాలపై శ్రీవారు ఊరేగనున్నారు. అందుకే ఒకరోజు బ్రహ్మోత్సవం, అర్ధబ్రహ్మోత్సవం అని ఈ వేడకను పిలుస్తారు. ఈ రోజున మాడవీధుల్లో ఊరేగే స్వామిని దర్శించుకుంటే, బ్రహ్మోత్సవాల తొమ్మిదిరోజుల వాహనసేవలను తిలకించినంత భాగ్యం దక్కుతుందని భావించి లక్షల సంఖ్యలో భక్తులు రథసప్తమికి తిరుమలకు చేరుకుంటారు.

వైకుంఠ ఏకాదశి టోకెన్ల తొక్కిసలాట ఘటన నేపథ్యంలో తిరుమలలో పటిష్ట ఏర్పాట్లను టీటీడీ చేసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వాహనసేవలు ఇలా..

ఉదయం 5.30 - 8: సూర్యప్రభ వాహనం (6.44 గంటలకు సూర్యోదయం)

9 - 10: చిన్నశేష వాహనం

11 - 12: గరుడ వాహనం

మధ్యాహ్నం 1 - 2: హనుమంత వాహనం

2 - 3: చక్రస్నానం

4 - 5: కల్పవృక్ష వాహనం

6 - 7: సర్వభూపాల వాహనం

రాత్రి 8 - 9: చంద్రప్రభ వాహనం

- ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మాడవీధుల్లో తాత్కాలిక షెడ్లు నిర్మించారు.
- మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.
- గతేడాది రథసప్తమికి 650 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తే ఈసారి ఈ సంఖ్యను 1,300కి పెంచారు. మరో వెయ్యి మంది విజిలెన్స్ సిబ్బంది కూడా విధుల్లో ఉంటారు.
- మూడు వేల మంది శ్రీవారిసేవకులు కూడా ఉదయం నుంచి రాత్రి వరకు గ్యాలరీల్లో ఉండే భక్తులకు సేవలు అందిస్తారు.
- 500 మంది టీటీడీ అధికారులు, ఉద్యోగులు గ్యాలరీల వద్ద విధుల్లో ఉంటారు.
- తొమ్మిది టన్నుల పూలతో అలంకరణలు చేపట్టారు. శ్రీవారి ఆలయంలో 3 టన్నులు, వెలుపల 6 టన్నులు వినియోగించారు.
- 30 వేల కట్‌ఫ్లవర్స్‌లో ఆలయంలోని పలు ప్రదే శాలను సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. ఆలయం ముందున్న బయోమెట్రిక్ వద్ద 10 వేల కట్‌ఫ్లవర్స్‌తో దశావతారాల సెట్టింగ్ చేశారు.

నిండిన ఉత్తరమాడవీధి

సోమవారం సాయంత్రానికే ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం 4 గంటల నుంచే మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుంటున్నారు. సూర్యకిరణాలు స్వామిని తాకే దాకా శుక్రవారం వేకువజాము నుంచి సూర్యప్రభవాహనాన్ని వాయువ్య దిక్కులో ఉంచుతారు. దీంతో ఉత్తరమాడవీధుల్లోని గ్యాలరీలన్నీ సోమవారం రాత్రికే నిండిపోయాయి.

..ఈ దర్శనాలన్నీ రద్దు

రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల జారీని సోమ, మంగళ, బుధవారాల్లో టీటీడీ రద్దు చేసింది. అలాగే మంగళవారం వీఐపీ బ్రేక్, ఆర్జితసేవలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర ప్రత్యేక దర్శనాలను రద్దు చేసినట్టు టీటీడీ స్పష్టం చేసింది. అలాగే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి రావాలని, లేనిపక్షంలో సర్వదర్శన క్యూలైన్ ద్వారానే స్వామిని దర్శించుకోవాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది.



రథసప్తమికి 3 లక్షల మంది

- భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం
- టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా మంగళవారం ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటలకు ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగే స్వామిని దర్శించుకునేందుకు రెండు నుంచి మూడు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని ఈవో శ్యామలరావు తెలిపారు. ఈసందర్భంగా చేసిన ఏర్పాట్లను అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇంచార్జ్ సీవీఎస్వో మణికంఠ, వివిధ విభాగాల అధికారులతో కలిసి ఈవో సోమవారం పరిశీలించారు. తిరుమలలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేశామంటూ, భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని ఈవో మీడియాకు తెలిపారు. గతేడాది కంటే రెండు రెట్లు అధికంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వివరించారు. మెడికల్ సిబ్బందితో పాటు అంబులెన్స్‌లు కూడా సిద్ధం చేశామన్నారు. సీసీ కెమెరాల నిఘాతో కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. దీనికి తగినట్టు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. గ్యాలరీల్లో అన్నప్రసాదం పంపిణీ, తాగునీరు, మరుగుదొడ్లు, షెడ్లు వంటి సౌకర్యాలను ఈవో, ఇతర అధికారులు తనిఖీ చేశారు. కొంతమంది భక్తులతో నేరుగా మాట్లాడారు.

అలిపిరి కాలినడక మార్గంలో తనిఖీలు

అలాగే ఈవో శ్యామలరావు అలిపిరి కాలినడకమార్గంలోని మోకాళ్లమిట్ట వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మరుగుదొడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలోనూ ఈవో తనిఖీలు చేశారు. అన్నప్రసాదాల నాణ్యతపై భక్తులతో నేరుగా మాట్లాడారు. తాను కూడా భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు.

పోలీసు వలయంలో తిరుప్పరంకుండ్రం

- నేడు ఆందోళనకు పిలుపునిచ్చిన హిందూ సంస్థలు
- కొండపైకి వెళ్లే దారులన్నీ మూత
- 144 సెక్షన్ అమలు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్య స్వామివారు కొలువైన ఆరు సుప్రసిద్ధ దివ్యక్షేత్రాలలో ప్రప్రథమ క్షేత్రంగా విరాజిల్లుతున్న తిరుప్పరంకుండ్రం ప్రస్తుతం పోలీసుల రక్షణవలయంలో ఉంది. ఆ కొండపైకి వెళ్లే ప్రధాన మార్గాలను మూసివేసిన పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. తిరుప్పరం కుండ్రం పర్వతాన్ని కాపాడేందుకు హిందూ సంస్థలన్నీ మంగళవారం ఆ క్షేత్రం వద్ద భారీ ఆందోళనకు సన్నాహాలు చేస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా, మదురై నుంచి తిరుప్పరంకుండ్రం ప్రాంతం వరకు 144 సెక్షన్ విధించారు. హిందూ సంస్థల ఆందోళనకు పోలీసుల అనుమతి నిరాకరించడంతో ఆ సంస్థల నాయకులు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. తమ పిటిషన్‌ను అత్యవసర పిటిషన్‌గా భావించి తక్షణమే విచారణ జరపాలన్న పిటిషనర్ల అభ్యర్థనను హైకోర్టు న్యాయమూర్తి ధనపాల్ తోసిపుచ్చారు. తిరుప్పరంకుండ్రం పర్వతంపై కాశీవిశ్వనాథుడి ఆలయం, దర్గా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం కోవిల్‌పట్టి ప్రాంతానికి చెందిన ఖాదర్‌బాషా కొండపై ఉన్న దర్గా వద్ద మేక పిల్లను బలిచ్చేందుకు బయలుదేరాడు. పోలీసులు సకాలంలోజోక్యం చేసుకుని అతడిని అడ్డుకున్నారు. దానికి నిరసనగా స్థానిక ముస్లింలు ఆందోళనకు దిగారు. ఆ తరువాత మదురై జిల్లాలోని అన్ని దర్గాలకు చెందిన ముస్లింలు మేక పిల్లలతో ఆ కొండపైకి ఎక్కేందుకు ప్రయత్నించారు. పోలీసులు జోక్యం చేసుకుని కొండపై జంతుబులలను నిషేధించినట్లు తెలిపి వారిని అక్కడి నుండి పంపించేశారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న రామనాధపురం ఎంపీ నవాజ్ ఘనీ ఆ పర్వతంపైకి వెళ్ళి పరిశీలించారు. ఆ సందర్భంగా యానతోపాటు వెళ్ళి యువకులు కొంత తమవెంట తీసుకెళ్లిన బిర్యానీని కొండపై కూర్చుని తిన్నారు. దానిని ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం బీజేపీ నేతలు అన్నామలై, హెచ్‌రాజా తదితర నాయకులంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేత హెచ్‌రాజా, ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ తదితరుల కొండపైన ఆలయానికి వెళ్లారు. ఆ సందర్భంగా బీజేపీ నేతలు మీడియాతో మాట్లాడుతూ కొండపై దర్గా వద్ద జంతుబలులు జరుగకుండా కాపాడాల్సిన బాధ్యత హిందూ సంస్థలకు ఉందని, తిరుప్పరం కుండ్రం రక్షణకు ఉద్యమం చేయాల్సిన నేపథ్యంలోనే హిందూ సంస్థలన్నీ కలిసి మంగళవారం ఆ పర్వత ప్రాంతం వద్ద ఆందోళనకు సన్నాహాలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయానికి, దర్గాకు వెళ్లే పూజారులు, సిబ్బందిని మాత్రమే కొండపైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.





తిరుప్పరంకుండ్రం పర్వతాలయం - కొండపై ఉన్నదర్గా



వైద్య బృందాన్ని అభినందిస్తున్న ఆస్పత్రి డైరెక్టర్ డా.బాలాజీ

నారాయణి ఆస్పత్రిలో 76 మూత్రపిండాల మార్పిడి చికిత్సలు

వేలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శక్తి అమ్మ ఆశీస్సులతో డైరెక్టర్ డా.బాలాజీ నేతృత్వంలో నారాయణి ఆస్పత్రిలో 76 మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. బంధువుల నుంచి దానంగా పొందిన 66 కిడ్నీలు, మెదడు నిర్జీవమైన వారు అందజేసిన మరో 10 కిడ్నీలను అవసరమైన రోగులకు అమర్చారు. ఆస్పత్రి కిడ్నీ మార్పిడి విభాగం నిపుణులు కార్తికేయన్, వైద్యులు శివానందం, మనీష్‌కుమార్, ఎయిల్‌నిలవన్, గంగా తదితరులతో కూడిన బృందాన్ని ఆస్పత్రి డైరెక్టర్ బాలాజీ జ్ఞాపికలు అందించి అభినందించారు. కార్యక్రమంలో భాగంగా అవయవాల మార్పిడి విభాగం ఆర్గనైజర్ షణ్ముగ సుందరంను డైరెక్టర్ బాలాజీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

10న మంత్రివర్గ భేటీ

- బడ్జెట్ రూపకల్పనపై చర్చ

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి వర్గ సమావేశం ఈ నెల 10న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరుగనుంది. ఈ సమావేశంలో వార్షిక బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. వచ్చే యేడాది ఏప్రిల్ లేదా మేలో శాసనసభ ఎన్నికలు జరుగనుండటంతో ఈ బడ్జెట్‌లో ప్రజాకర్షణ పథకాలను చేర్చాలని ముఖ్యమంత్రి స్టాలిన్, సీనియర్ మంత్రులు భావిస్తున్నారు. ఈ సమావేశంలోనే శాసనసభ బడ్జెట్ సమావేశాలను ఈ నెలాఖరున జరపాలా? లేక మార్చి నెల మొదటివారంలో నిర్వహించాలా? అనే అంశంపై సమగ్రంగా చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నారు.

రైల్వే పథకాలకు రూ.6,626 కోట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.6,626 కోట్లు కేటాయించారు. ఈ మేరకు డీఎంకే సభ్యులు అడిగిన ప్రశ్నకు రైల్వే శాఖ మంత్రి లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. దేశంలో ప్రస్తుతం నడుస్తున్న వందే భారత్ రైళ్లలో 8 తమిళనాడులోనే ఉన్నాయన్నారు. అమృత్ భారత్ పథకంలో రూ.2,948 కోట్లతో 77 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు జరుగున్నాయని తెలిపారు. అలాగే, రూ.33,467 కోట్లతో 2,587 కి.మీ మేర కొత్త రైలు మార్గం పనులు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్రం తెలిపింది.

6న ఢిల్లీలో డీఎంకే విద్యార్థి విభాగం ధర్నా

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు డీఎంకే విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 6న ఢిల్లీలో మహా ధర్నా చేపట్టనున్నారు. ఈ విషయమై విద్యార్థి విభాగం విడుదల చేసిన ప్రకటనలో.. కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలోని విశ్వవిద్యాలయాల ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ ఏర్పాటుకు సంబంధించి కొత్త విధి విధానాలు వెనక్కి తీసుకోవాలి, నీట్ రద్దు సహా పలు డిమాండ్లతో ఈ నెల 6వ తేది ఉదయం 10 గంటలకు ఢిల్లీ జంతర్ మంతర్‌లో మహా ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

నైవేలి, వేలూరు నుంచి

త్వరలో విమాన సేవలు

- వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం



నైవేలి విమానాశ్రయం

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 'ఉడాన్' పథకంలో భాగంగా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి.. నైవేలి, వేలూరు నుంచి త్వరలో విమాన సేవలు ప్రారంభిస్తామని కేంద్ర రైల్వే సహాయ మంత్రి మురళీధర్ ప్రకటించారు. పార్లమెంటు సమావేశాల్లో సోమవారం డీఎంకే ఎంపీ కనిమొళి, ఎస్పీఎన్ సోము అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. ఉడాన్ పథకంలో తమిళనాడులో ఎంపిక చేసిన విమానాశ్రయాలు ఏమేం వున్నాయి? ఆ చర్యలు ఎంతవరకు వచ్చాయి? ఆ విమానాశ్రయాలు ఎప్పుడు వినియోగంలోని వస్తాయని డీఎంకే ఎంపీ కనిమొళి ప్రశ్నించారు. ఇందుకు కేంద్రమంత్రి మురళీధర్ మోహల్ సమాధానమిస్తూ... ఉడాన్ పథకానికి తమిళనాడు నుంచి సేలం, వేలూరు, నైవేలి, తంజావూరు, రామనాధపురం ప్రాంతాలు ఎంపిక చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వీటిలో సేలం నుంచి విమాన సేవలు ప్రారంభమయ్యాయని తెలిపారు. నైవేలి, వేలూరు విమానాశ్రయాల పనులు పూర్తయి, సంబంధిత లైసెన్స్‌ల ప్రక్రియ పురోగతిలో ఉందన్నారు. ఈ రెండు నగరాల నుంచి త్వరలో విమాన సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. రామనాథపురంలో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన స్థలం ఎంపిక ఆ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. తంజావూరు విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు కోసం ఎయిర్‌పోర్ట్ అథారిటీ స్థలం స్వాధీనం చేసుకున్న తర్వాత నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఇవి మినహా, తమిళనాడులోని అరక్కోణం, చెట్టినాడు, చోళవరం, సూలూరు, ఉళుందూర్‌పేట తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లకు మరమ్మతులు చేసి ఉడాన్ పథకం కింద వేలం వేసేందుకు శాఖాపరమైన చర్యలు చేపట్టామన్నారు. ఉడాన్ పథకంలో విమానం ప్రారంభించిన తర్వాత, ఆ మార్గాల్లో ప్రయాణికుల ఆదరణ, ఇతర అంశాల ఆధారంగా ఎప్పటికప్పుడు వేలం వేయనున్నట్లు తెలిపారు. విమానాలు నడిపే సంస్థలు ఈ మార్గాలను నిరంతరం పర్యవేక్షిస్తూ వేలంలో పాల్గొంటారన్నారు. వేలం ముగిశాక అర్హత కలిగిన సంస్థ విమానాలు నడిపేందుకు అనుమతిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.

1931లో బీచ్-తాంబరం మధ్య తొలి ఎలక్ట్రిక్ రైలు



1931లో పరుగులు పెట్టిన తొలి విద్యుత్ రైలు



'అవేర్‌నెస్ వాక్'ను ప్రారంభిస్తున్న ఐసీఎఫ్ జీఎం

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎలక్ట్రిక్ రైలు తొలిగా పరుగులు పెట్టి సోమవారానికి వందేళ్లు పూర్తయ్యాయి. 1925 ఫిబ్రవరి 3వ తేదీన ముంబైలోని విక్టోరియా టెర్మినస్‌కు తొలి విద్యుత్ రైలు అడుగులు వేసింది. అప్పటి వరకు రణగణధ్వనులతో పరుగులు పెట్టిన రైళ్లను మాత్రమే చూసిన ముంబై జనం.. ఎలాంటి శబ్దం లేకుండా కేవలం చుక్.. చుక్ మంటూ వచ్చిన రైలు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. అయితే దక్షిణభారత్‌లో మాత్రం 1931లో ఇలాంటి రైలు పరుగులుపెట్టింది. ఆ సంవత్సరం తొలిగా మద్రాస్ బీచ్-తాంబరం మధ్య 34 కి.మీటర్ల మేర ఈఎంయూ రైలు పరుగులు పెట్టింది. అయితే ఇంట్రిగల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో మాత్రం 1963-64లో తొలిగా ఎలక్ట్రిక్ రైలు తయారైంది. అది మొదలు ప్రస్తుత వందేభారత్ వరకు ఐసీఎఫ్ నిరాటంకంగా దేశానికి దేవలందిస్తూనే వుంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ రైలు పరుగులుపెట్టి వందేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఐసీఎఫ్‌లో అవేర్‌నెస్ వాక్ కార్యక్రమం జరిగింది. ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు ఈ కార్యక్రమానికి పచ్చజెండా వూపి లాంఛనంగా ప్రారంభించారు.

దక్షిణ రైల్వే ఆధ్వర్యంలో వాకథాన్

పెరంబూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యో తి): రైల్వేలో విద్యుదీకరణ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా దక్షిణ రైల్వే ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించారు. నుంగంబాక్కంలోని రైల్వే హౌస్‌లో సోమవారం ఉదయం వాకథాన్‌లో దక్షిణ రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ కౌశల్ కిషోర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సోమేష్‌కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుశీల్‌కుమార్ మౌర్య, చీఫ్ పర్సనల్ ఆఫీసర్ హరికృష్ణన్ సహా ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. రైల్వే వినియోగదారులు, సాధారణ ప్రజలను భాగస్వామ్యులను చేసే కార్యక్రమాలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.